# కామ్రేడ్ మొగులూరి సోమాచారికి జోహార్లు

**కామ్రేడ్** మొగులూరి సోమాచారి తూర్పుగోదావరిజిల్లా సామర్లకోటలో జులై 6న వృద్ధాప్య సమస్యలతో బాధపడుతూ మరణించారు.

కామ్రేడ్ సోమాచారి సిపిఐ(ఎం)గా వున్న కాలంలో పార్టీ తూర్పుగోదావరి జిల్లా కమిటీ సభ్యునిగా సామర్లకోట షుగర్ ఫ్యాక్టరీ తదితర కార్యవర్గ సంఘాలలో ఆర్గనైజర్‌గా, నాయకుడిగా ఒక పాత్ర నిర్వహించారు.

శ్రీకాకుళ గిరిజనోద్యమ స్ఫూర్తితో 1967 జనరల్ ఎన్నికల తర్వాత నుంచి ఏజన్సీ ప్రాంతంలో ఉద్యమాన్ని నిర్మించాలన్న విప్లవకారుల అవగాహన ప్రకారం కాకినాడ విద్యార్థి కామ్రేడ్స్ సహాయ సహకారాలతో ఏజన్సీ ప్రాంతాన్ని కార్యక్షేత్రంగా ఎంచుకున్నారు. కామ్రేడ్ శాంతిరాజుతో కలసి గిరిజన సమస్యలపై ప్రజలను ఆర్గనైజ్‌చేసే కార్యక్రమం చేపట్టారు.

ముఠాదారీ దోపిడీ, వడ్డీవ్యాపారస్తుల దోపిడీ, గిరిజనుల భూములను మాయోపాయాలతో కాజేసిన మైదానప్రాంత భూస్వాములకు వ్యతిరేకంగా ఆందోళనోద్యమాన్ని నిర్మించే కర్తవ్యంలో వుండగా 1969లో అరెస్టుచేయబడి, హైద్రాబాద్ కుట్రకేసులో ముద్దాయిగా యిరికించబడి 3 సంవత్సరాలు జైలు జీవితాన్ని అనుభవించారు.

1975-77 అత్యయిక పరిస్థితికాలంలో కూడా నిర్బంధించబడి జైలు జీవితం గడిపారు. కామ్రేడ్ సోమాచారి మంచి కామ్రేడ్. ఆయన మృతికి నా ప్రగాఢసంతాపాన్ని తెలియజేస్తున్నాను.

**8-6-16** **విశ్వం**

# ప్రజాకళాకారుడు కాట్రగడ్డ హనుమంతరావుకు ఘన నివాళులు



ప్రజాకళాకారుడు, సిపిఐ(ఎం.ఎల్) నగర నాయకులు కాట్రగడ్డ హనుమంతరావు (66 సం॥లు) 28-5-16 అర్థరాత్రి అనారోగ్యంతో హటాత్తుగా మృతిచెందారు. కాట్రగడ్డ హనుమంతరావు మృతదేహంపై సిపిఐ(ఎం.ఎల్) నగర నాయకులు ఉల్లిగడ్డల నాగేశ్వరరావు ఎర్రజెండాను కప్పి జోహార్లర్పించారు. పార్టీ నాయకులు సింహాద్రి లక్ష్మారెడ్డి, దేవరశెట్టి వెంకటస్వామి; ఏఐఎఫ్‌టియు-న్యూ నాయకులు బి.రంగస్వామి, యు.కృష్ణ; స్త్రీవిముక్తిసంఘటన నాయకులు బి.మల్లీశ్వరి మరియు వివిధ ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు, వివిధ శ్రామిక కాలనీల ప్రజలు ఆయనకు కడసారి నివాళు లర్పించారు.

స్థానిక యతిరాజనగర్, కృష్ణబాబుకాలనీ, గోయల్‌కాలనీ తదితర కాలనీల నిర్మాణంలోనూ; పల్నాడు ప్రాంతంలో ప్రభుత్వ భూములపై హక్కుకోసం పేదలు సాగించిన పోరాటాల్లోనూ-గత నాలుగు దశాబ్దాల కాలంలో కాట్రగడ్డ హనుమంతరావు క్రియాశీలక పాత్ర నిర్వహించారు. ప్రజాకళాకారునిగా, నాటక రచయితగా పలు సామాజిక సమస్యలపై ఆయన రాసిన, ప్రదర్శించిన నాటకాలు ప్రేక్షకులను ఆకట్టుకునేవి, ఆలోచింపజేసేవి. ఎర్రజెండా నీడన కడదాకా నిలచిన ఆయన, ఉద్యమ జీవితంలో పలుమార్లు పోలీసు నిర్బంధాన్ని, అరెస్టులను, అక్రమకేసులను ఎదుర్కొన్నారు.

**అంతిమయాత్ర**

29-5-16 సాయంత్రం స్థానిక యతిరాజనగర్ నుండి పెద్దసంఖ్యలో ప్రజలు జోహార్లు చెపుతూ తరలిరాగా కాట్రగడ్డ హనుమంతరావు అంతిమయాత్ర సాగింది. తదనంతరం శ్రీనివాసరావుపేట శ్మశానంలో అంత్యక్రియలు నిర్వహించారు.

హనుమంతరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్రనాయకులు గుర్రం విజయకుమార్, ఓపిడిఆర్ జిల్లా నాయకులు జె.నరసింహారావు, రైతుకూలీ సంఘం నాయకులు కా॥ బి.రఘు, న్యాయవాది చెరుకూరి సత్యనారాయణ, సిపిఐజిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్, జనసాహితి ప్రధానకార్యదర్శి దివికుమార్, ఎంఎల్ కమిటి నాయకులు కొల్లిపర వెంకటేశ్వరరావు, శ్రామిక జన సమాఖ్య నాయకులు ముప్పా సుబ్రహ్మణ్యం, ఏఐటియుసి నాయకులు చల్లా ఆంజనేయులు, మిర్చియార్డు కాపలావర్కర్స్ యూనియన్ నాయకులు ఓర్చుకొండలు, బల్ల రిక్షా వర్కర్స్ యూనియన్ నాయకులు బత్తుల వెంకటేశ్వర్లు తదితరులు వున్నారు.

oooooo

# కా॥ముసునూరి సత్యనారాయణకు జోహార్లు



**సిపిఐ(ఎం.ఎల్)** పార్టీ సభ్యుడు కామ్రేడ్ ముసునూరి సత్యనారాయణ (66సం॥) 2-6-16వ తేది రాత్రి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మరణించారు. ఆయన మృతదేహంపై సిపిఐ(ఎం.ఎల్) నాయకులు కా॥ సింహాద్రి లక్ష్మారెడ్డి ఎర్రజెండాను కప్పి జోహార్లర్పించారు. 3-6-16 సాయంత్రం 5 గంటలకు పిడుగురాళ్ళ వద్ద గల కొండమోడులో పార్టీ నాయకులు, స్నేహితులు, బంధువులు కా॥సత్యనారాయణ అంత్యక్రియలు నిర్వహించారు.

కా॥సత్యనారాయణ అతి సామాన్యమైన చేనేత కుటుంబంలో పుట్టి నేత కార్మికునిగా వృత్తి చేసుకుంటూనే అధ్యయనంపట్ల అత్యంత శ్రద్ధ కలిగివుండేవాడు. నల్గొండజిల్లా సూర్యాపేట తాలూకా కోటపాడులో పుట్టిన సత్యనారాయణ తండ్రి మరణానంతరం చిన్నతనంలోనే తన తల్లి మరియు సోదరునితో కలిసి బ్రతుకుదెరువుకోసం మంగళగిరికి వలసవచ్చి, పాత మంగళగిరిలో నివాసముండే సమయంలో యుసిసిఆర్ఐ(ఎం.ఎల్) కార్యకర్తలతో పరిచయం ఏర్పడిన క్రమంలో పార్టీ సాహిత్యం చదువుతూ, పార్టీ కార్యకలాపాలలో చురుకుగా పాల్గొనేవారు. కార్మికునిగా తన వృత్తి చేసుకుంటూనే కార్మిక వర్గ దృక్పధంతో కార్యాచరణ సాగించిన నిశితదృష్టి, పరిశీలన, విప్లవ సిద్ధాంతంపట్ల దృఢవిశ్వాసం కలిగిన కార్మికవర్గ కార్యకర్త కా॥సత్యనారాయణ తను నమ్మిన ఆశయంకోసం చివరికంటా నిబద్ధతతోటి నిలిచారు. తన ఇద్దరు పిల్లలు పార్టీ పూర్తికాలం కార్యకర్తలుగా వచ్చేందుకు ప్రోత్సహించారు.

బ్రతుకుదెరువు కోసం మంగళగిరినుండి సూరత్ ప్రాంతానికి వలసవెళ్ళి మరమగ్గాలపై 12 గంటలు పనిచేసి అదనంగా మరో నాలుగు గంటలు పార్టీపని చేసే పని పద్ధతులను పాటించారు. ఆ క్రమంలోనే సూరత్‌లో సహచరులతో మిత్రులతో కలిసి "జన జాగృతి సంఘటన" సంస్థను ఏర్పాటుచేయడంలో క్రియాశీలక పాత్ర వహించారు. ఈ సంస్థ ద్వారా సూరత్ కార్మికులలో 10 సం॥లపాటు కృషి చేశారు. అక్కడ డాంగ్‌జిల్లాలో జరుగుతున్న ఆదివాసీ పోరాటాలకి సంఘీభావంగా కార్మికవర్గాన్ని కూడ గట్టటంలో కా॥సత్యనారాయణ మంచి కృషి చేశారు.

సూరత్‌నుండి మంగళగిరి తిరిగివచ్చిన కాలంలో ఆనాడు పార్టీలో తలెత్తిన మార్క్సిస్టు వ్యతిరేక, సిద్ధాంత గందరగోళాల నడుమ వర్గదృష్టితో, సరైన విధానాలవైపు నిలిచి కడదాకా ఆ విధానాలను ముందుకు తీసుకెళ్ళటానికి తనవంతు తోడ్పాటు నందించారు.

**సంస్మరణ సభ**

15-6-16వ తేది ఉదయం 11 గంటలకు కా॥సత్యనారాయణ నివాసస్థలం ఆయన కొండమోడు లోని కా॥తరిమెల నాగిరెడ్డినగర్‌లో ఆయన సంస్మరణ సభ జరిగింది. ఈ సంస్మరణ సభకు రైతుకూలీ సంఘం(ఆం.ప్ర) జిల్లా ఉపాధ్యక్షులు కా॥నీలాద్రి రాంబాబు అధ్యక్షత వహించారు. తొలుత కా॥సత్యనారాయణ చిత్రపటానికి రై.కూ.సం. రాష్ట్ర కార్యదర్శి కా॥కె.కోటయ్య పూలదండవేసి నివాళులు అర్పించారు. సభలో రెండు నిముషాలు మౌనం పాటించి జోహార్లు చెప్పారు.

సిపిఐ(ఎం.ఎల్) జిల్లా నాయకులు కా॥సింహాద్రి లక్ష్మారెడ్డి, ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర నాయకులు కా॥డి.వి.ఎన్.స్వామి, రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర నాయకులు కా॥ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, ఓపిడిఆర్ రాష్ట్ర కార్యదర్శి కా॥వి.హనుమంతరావు, కా॥సత్యనారాయణ బావమరిది ప్రొఫెసర్ ఎ.వెంకటేశ్వర్లు, సూరత్ నుండి వచ్చిన కా॥సత్యనారాయణ సహచరులు డి.వెంకటేశ్వర్లు, రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా కార్యదర్శి కా॥ పాటిబండ్ల కోటేశ్వరరావు, ఎన్‌వైఎస్ జిల్లాకార్యదర్శి కా॥కె.శ్రీను ఈ సంస్మరణసభలో ప్రసంగించి కా॥ సత్యనారాయణకు నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

oooooo